సాక్షి చిత్తూరు

సోమవారం । 29 । సెప్టెంబర్ । 2025



గరుడవాహనంపై భక్త జన కోటిని కటాక్షిస్తున్న మలయప్పస్వామి

జగద్రక్షుడు, కలియుగ వైకుంఠుడైన తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజైన ఆదివారం ఉదయం స్వామివారు మోహినీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఆరు గంటలకే వరుణుడు ఆహ్వానం పలకగా.. గరుడ వాహనంపై విహరిస్తూ స్వామి కనువిందు చేశారు. జగాన్ని పాలించే జగత్కల్యాణ చక్రవర్తి మలయప్ప దేదీప్యమాన కాంతులతో ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తకోటిని అనుగ్రహించారు. గోవిందా..గోవింద..! అంటూ భక్తులు స్వామి వారి దివ్యమంగళ రూపాన్ని దర్శించి తన్మయత్వం చెందారు. మునుపెన్నడూ లేని రీతిలో గరుడ సేవకు భక్తులు పోటెత్తారు.



తిరుమల మాడ వీధుల్లో అశేష భక్తజన వాహిని

గరుడోత్సాహం

వైభవంగా శ్రీవారి గరుడ సేవ

- సాయంత్రం 6 గంటల నుంచే వాహన సేవ ప్రారంభం
- ఉదయం మోహినీ అవతారంలో మలయప్ప దర్శనం
- శ్రీవారికి అత్యంత ఇష్టమైన గరుడుని అధిరోహించి కటాక్షం
- జగద్రక్షుడ్ని కనులారా వీక్షించి పులకించిన భక్తజనం
- భక్తులతో కిక్కిరిసిన తిరుమల కొండ
- నేటి స్వర్ణరథోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

తిరుమల : అఖిలాండ బ్రహ్మాండ నాయకుడు తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఐదో రోజు ఆదివారం ఉదయం జగద్రక్షకుడైన శ్రీ వేంకటేశ్వరుడు మోహినీ రూపంలో దంత పల్లకీపై శృంగార రసాధి దేవతగా, పక్కనే వెన్న ముద్ద చేతబట్టిన చిన్ని కృష్ణుడితో కలసి హోయ లొలుకుతూ భక్తకోటిని సాక్షాత్కరించారు.

కట్టుదిట్టమైన భద్రత

తమిళనాడు ఘటన నేపథ్యంలో పోలీసులు, అధికారులు తిరుమల భద్రతను మరింత పెంచారు.



మోహినీ అవతారంలో ఊరేగింపుగా వస్తున్న గోవిందుడు



గరుడోత్సవంలో భాగంగా కళాకారుల ప్రదర్శన



సంప్రదాయ నృత్య ప్రదర్శనలో కళాకారులు

గరుడ వాహన సేవలో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ సుబ్బరాయుడు పటిష్ట భద్రతను కల్పించారు. పరిమిత సంఖ్యలోనే భక్తులను గ్యాలరీల్లోకి అనుమతించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయ వీధుల్లోకి రాకుండా కట్టడి చేశారు. అలిపిరి, శ్రీవారి మెట్టు మార్గాల్లో నడిచి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్, ఆలయ సిబ్బంది అప్రమత్తతో భక్తులకు త్వరగా దర్శనం కల్పించారు. ఘాట్ రోడ్లలో ద్విచక్ర వాహనాల అనుమతి లేకపోవడంతో భక్తులు ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ ట్యాక్సీల్లో తిరుమలకు రావాల్సి వచ్చింది.

కిక్కిరిసిన కొండ

గరుడ వాహన సేవ కోసం భక్తులు పోటెత్తారు. తిరుమల కొండ భక్తులతో నిండిపోయింది. ఉదయం నుంచే గ్యాలరీల్లో పడిగాపులు పడ్డారు. ఉదయం మోహినీ వాహన సేవలో పాల్గొన్న భక్తులే ఎక్కడికక్కడ గరుడ వాహన సేవ కోసం నిరీక్షించారు. రెండు లక్షల మంది కూర్చునే విధంగా సిద్ధం చేసిన గ్యాలరీలు మధ్యాహ్నం ఒంటి గంటకే నిండిపోయాయి. ఇన్నర్ రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్లలో వేచి ఉండే భక్తులను సుపథం, సౌత్ వెస్ట్ కార్నర్, గోవింద నిలయం నార్త్ వెస్ట్ గేట్, నార్త్ ఈస్ట్ గేట్ల ద్వారా గ్యాలరీల్లోకి అనుమతించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇలా రెండోసారి భర్తీ చేసి భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు.



బారులు తీరిన వాహనాలు



భక్తులను నియంత్రిస్తున్న పోలీసులు



మురుగన్ వేషధారణ



దేవతల వేషధారణలో కళాకారులు



వాహన సేవలో ఈవో

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 29వ తేదీన కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలన్నారు. గైర్హాజరయ్యే వారిపై శాఖాపరంగా చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

3 నుంచి డీఎస్సీ అభ్యర్థులకు శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో మెగా డీఎస్సీలో ఎంపికైన నూతన టీచర్లకు అక్టోబర్ 3వ తేదీ నుంచి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ శిక్షణకు విద్యాశాఖ, జిల్లా సమగ్రశిక్ష శాఖల అధికారులు కసరత్తు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో టీచర్ పోస్టులకు ఎంపికైన 1,529 మందికి పోస్టుల వారీగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ శిక్షణకు ప్రత్యేకంగా మాస్టర్ ట్రైనర్లను నియమించనున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో చిత్తూరు జిల్లా కేంద్రంలోని ఆర్‌కే పాఠశాల (కట్టమంచి), ఎస్వీ సెట్ ఫార్మసీ కళాశాల (ఆర్‌వీఎస్ నగర్), తిరుపతి జిల్లా కేంద్రంలో విశ్వం పాఠశాల (జీవకోన), మెడ్జీ పాఠశాల (తిరుపతి), ఢిల్లీ పబ్లిక్ స్కూల్, గూడూరులోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కాగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు మాన్యువల్ విధానంలో కౌన్సిలింగ్ నిర్వహించి పోస్టింగ్ ఇవ్వనున్నట్లు విద్యాశాఖ వర్గాల సమాచారం.

రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలి

- బోయకొండ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన పెద్దిరెడ్డి దంపతులు
- హోమపూజల్లో పాల్గొన్న పెద్దిరెడ్డి

చౌడేపల్లె: రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలని, పంటలు బాగా పండాలని, ప్రజలంతా ఆనందంగా జీవనం గడపాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సతీమణి స్వర్ణమ్మ దంపతులు బోయకొండ గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు అనీషారెడ్డి, బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, కొండవీటి నాగభూషణం, శ్రీనాథరెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజుతో కలిసి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వీరికి ఆలయ ఈఓ ఏకాంబరం ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయంలో మహాచండీ దేవి అలంకరణలో కొలువుదీరిన అమ్మవారికి పెద్దిరెడ్డి దంపతులు ప్రత్యేక అభిషేక పూజలు, అర్చనలు, చేశారు. అనంతరం హోమ పూజల్లో పాల్గొని, ప్రధాన గర్భాలయం కింద ఉన్న మూలస్థానం, రణభేరి గంగమ్మ అమ్మవార్లకు పూజలు చేశారు. వేదపండితులు పెద్దిరెడ్డి దంపతులకు ఆశీర్వాదం అందించారు. అనంతరం ఈఓ పవిత్ర తీర్థప్రసాదాలతోపాటు అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంపీపీల సంఘ అధ్యక్షుడు బైరెడ్డిపల్లె రెడ్డెప్ప, పుంగనూరు ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి కొత్తపల్లి చెంగారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు నాగభూషణరెడ్డి, మాజీ ఎంపీపీలు అంజిబాబు, రుక్మిణమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు యాదవ్, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



హోమపూజల్లో పాల్గొని పూర్ణాహుతి చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు

రేబిస్‌తో బీకేర్‌ఫుల్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): రేబిస్‌తో బీకేర్‌ఫుల్ అని జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ ఉమామహేశ్వరి సూచించారు. చిత్తూరు నగరంలోని జిల్లా పశు వైద్యశాలలో ఆదివారం ప్రపంచ రేబిస్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా కుక్కలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. అనంతరం యజమానులకు పెంపుడు కుక్కల సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ప్రతి యజమాని తమ పెంపుడు కుక్కలకు విధిగా టీకాలు వేయించాలన్నారు. కుక్కలను బయటికి తీసుకెళ్లేటప్పుడు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పెంపుడు కుక్కల వల్ల ఇరుగుపొరుగు వారికి ఇబ్బంది లేకుండా చూసుకోవాలన్నారు. కుక్క కరిస్తే ప్రజలు వెంటనే టీకాలు వేయించుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎపిడిమాలజిస్ట్ శ్రీవాణి, పశుసంవర్ధకశాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



కుక్కలకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న జేడీ ఉమామహేశ్వరి

1,276 కుక్కలకు టీకాలు

ప్రపంచ రేబిస్ డేలో భాగంగా జిల్లావ్యాప్తంగా 1,276 పెంపుడు కుక్కలకు టీకాలు వేసినట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ ఉమామహేశ్వరి తెలిపారు. 33 మండలాల పరిధిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. సాయంత్రానికి 1276 కుక్కలకు వ్యాధి నిరోధక టీకాలు వేశామన్నారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణుల రక్షణకు డిజిటల్ బుక్



క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి ఆర్కేరోజా

- నేతల సమక్షంలో క్యూఆర్ కోడ్ ఆవిష్కరించిన మాజీ మంత్రి ఆర్కేరోజా

నగరి : కూటమి పాలనలో అన్యాయానికి గురైన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సామాన్య ప్రజల కోసం పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డిజిటల్ బుక్ లాంచ్ చేశారని మాజీ మంత్రి ఆర్కేరోజా స్పష్టం చేశారు. ఆదివారం ఆమె తన నివాస కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ శ్రేణులను ఇబ్బంది పెట్టే వారికి భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని భరోసా కల్పించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 15 నెలలుగా అరాచక పాలన సాగుతోందని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గత ప్రభుత్వంలో పనిచేసిన అధికారులపై అక్రమ కేసులు పెడుతూ నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎప్పటికప్పుడు కోర్టులు అక్షింతలు వేస్తున్నా ఈ ప్రభుత్వానికి బుద్ధి రావడం లేదన్నారు. ఎవరికి అన్యాయం జరిగినా 'డిజిటల్ బుక్'లో నమోదు చేయవచ్చన్నారు. ''డీబీ.డబ్ల్యూడబ్ల్యూవైఎస్‌ఆర్‌సీపీ.కామ్'' అనే వెబ్‌సైట్‌లో గానీ, 040–49171718 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. పార్టీ లీగల్ సెల్ ప్రధానకార్యదర్శి రవీంద్ర, నగరి, పుత్తూరు మున్సిపల్ చైర్మన్లు నీలమేఘం, హరి, వైస్ చైర్మన్లు జయప్రకాష్, శంకర్, బాలన్, జెడ్పీటీసీ పరంధామన్, నిండ్ర, విజయపురం ఎంపీపీలు లత, మంజుబాలాజి, భార్గవి, నగరి, పుత్తూరు, నిండ్ర, విజయపురం, వడమాలపేట మున్సిపల్, మండల అధ్యక్షులు, మండల పార్టీ కమిటీ, అనుబంధ కమిటీ నేతలు పాల్గొన్నారు.

మీకు అండగా ఉండేందుకే డిజిటల్ బుక్

- వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి డిజిటల్ బుక్ ఆవిష్కరించిన మాజీ ఉప ముఖ్యమంత్రి

కార్వేటినగరం: కూటమి ప్రభుత్వంలో దౌర్జన్యాలు, అక్రమ అరెస్టులు పెరిగిపోయాయని, అందుకే అన్యాయానికి గురైన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉండేందుకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ ఆవిష్కరించారని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. ఆదివారం ఆయన పుత్తూరులోని తన నివాసంలో నాయకులతో కలిసి డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను పార్టీ కేంద్ర కార్యాలయానికి రికార్డులతో చేరవేయడానికి జననేత జగనన్న ఎంచుకున్న బాణం డిజిటల్ బుక్ అని అన్నారు. డిజిటల్ బుక్‌లో నమోదు చేసే ప్రతి సమస్యను అధికారం చేపట్టిన వెంటనే పరిష్కరించడం జరుగుతుందని జగనన్న కార్యకర్తలకు భరోసా ఇస్తున్నారని చెప్పారు. ఎవరైనా ఇబ్బందులు పెడితే 040–49171718 నంబర్‌కు కాల్ చేసి తమ సమస్యలు చెప్పవచ్చన్నారు. వైఎస్సార్‌సీపీ విజయానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా కలసికట్టుగా పని చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. డిజిటల్ బుక్‌పై గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి కూటమి ప్రభుత్వం చేపడుతున్న ఆగడాలను ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు, ఎంపీపీలు, మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



డిజిటల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, నాయకులు

క్లుప్తంగా

జీఎస్టీ చాంపియన్స్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో జీఎస్టీ చాంపియన్స్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ అమలులో ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ ప్రక్రియకు జేసీని జిల్లా జీఎస్టీ కోఆర్డినేటర్‌గా రిజిస్టర్ చేయడం జరుగుతుందన్నారు. అనంతరం జేసీ జిల్లాస్థాయి, నియోజకవర్గ, మండల స్థాయి జీఎస్టీ కోఆర్డినేటర్ల రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలన్నారు. మండలస్థాయి జీఎస్టీ కోఆర్డినేటర్లు తమ పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయ స్థాయి జీఎస్టీ కోఆర్డినేటర్లను నమోదు చేయాలన్నారు. వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ పూర్తయ్యాకే మొబైల్ యాప్ ప్రారంభం అవుతుందన్నారు. ఈ ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా తీసుకుని త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

లాటరీ విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో నిషేధిత లాటరీ టికెట్లు విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. నగరంలో విచ్చలవిడిగా లాటరీ విక్రయాలు జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో వన్‌టౌన్ టూటౌన్ పోలీసులు కలిసి ఆదివారం తనిఖీలు నిర్వహించారు. వేపమాను వీధిలో లాటరీ టికెట్లు విక్రయిస్తున్న రాధాకృష్ణ, మారిముత్తు అనే ఇద్దరిని అరెస్టు చేసి రూ.2 వేల నగదు, టికెట్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే వీరభద్ర కాలనీలో లాటరీ టికెట్లు విక్రయిస్తున్న రవి అనే నిందితుణ్ని అరెస్టు చేసి రూ.1800 నగదు స్వాధీనం చేసుకున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

చిత్తూరు అర్బన్: మొబైల్ గేమ్స్, మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చిత్తూరులో చోటు చేసుకుంది. నగరంలోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన దుర్గాప్రసాద్ మద్యానికి అలవాటు పడ్డాడు. అలాగే మొబైల్ గేమ్స్‌కు బానిసయ్యాడు. ఈక్రమంలో మానసికంగా ఒత్తిడికి గురై బాలాజీనగర్‌లోని పాత ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. ఆస్పత్రికి తరలించగా వైద్యులు దుర్గాప్రసాద్ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరం తేనెబండ శ్రీనివాసపురం సమీపంలో ఆదివారం ఏడుగురు జూదరులు టూటౌన్ పోలీసులకు పట్టుబడ్డారు. అందిన సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు చేయగా ఏడుగురు పేకాట ఆడుతున్నట్లు గుర్తించారు. వారి నుంచి రూ.1,890 స్వాధీనం చేసుకుని..పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు పోలీసులు చెప్పారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పుంగనూరుకు ప్రథమ స్థానం

పుంగనూరు: జిల్లా స్థాయి స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో పుంగనూరు మున్సిపాలిటీకి ప్రథమ స్థానం లభించినట్లు ఆదివారం కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం, పన్నుల వసూళ్లు, ఇంటింటా చెత్తసేకరణ, తాగునీటి సరఫరా తదితర 10 కీలక అంశాల ఆధారంగా ప్రభుత్వం అవార్డులు కేటాయించింది. ఈ విభాగాల్లో జిల్లాలో ప్రథమ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 7వ ర్యాంకు సాధించినట్లు వివరించారు.

WANTED
01.10.2025
1-203 Sai Nagar Street, Opp: Maya Bazzar, HP Petrol Bunk, Sreenivasapuram, Tirupati
Cell: 9000851530, 9177903746, 8885004583



మహాచండీదేవి అలంకరణలో బోయకొండ గంగమ్మ

మహాచండీగా బోయకొండ గంగమ్మ

దసరా మహోత్సవాల్లో భాగంగా ఆరవరోజైన ఆదివారం బోయకొండ గంగమ్మ మహాచండీ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా.. భక్తుల పాలిట వరాలిచ్చే కొంగు బంగారంగా అమ్మవారు ప్రసిద్ధికెక్కారు. అమ్మవారిని పట్టుపీతాంబరాలు, రంగు రంగుల పూలు, స్వర్ణాభరణాలతో శత్రు సంహారి మహాచండీ దేవిగా కొలువుదీర్చారు. అమ్మవారి ఉత్సవమూర్తి ఎదుట ఈఓ ఏకాంబరంతో పాటు ఉభయదారులచే అమ్మవారికి ప్రత్యేక హోమ పూజలతో పాటు పూర్ణాహుతి చేశారు. అనంతరం పవిత్ర తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

- చౌడేపల్లె



బోయకొండ: అమ్మవారి ఉత్సవమూర్తి ఎదుట హోమ పూజలు చేస్తున్న ఉభయదారులు

గ్రామీణ వైద్యానికి ఆటంకం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు సమ్మెసైరన్ మోగించారు. సోమవారం నుంచి సమ్మెలోకి వెళ్లడంతో పాటు ఓపీ సేవలకు స్వస్తి పలకనున్నారు. అత్యవసర సేవలకు మాత్రమే మినహాయింపు ఇస్తూ..డిమాండ్ల సాధనకు పిడికిలి బిగించారు. ఈమేరకు ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ (ఏపీపీహెచ్‌సీడీఏ) నాయకులు నోటీసు సైతం అందజేశారు. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు జిల్లావ్యాప్తంగా సమ్మె చేపట్టనున్నారు. దీంతో పల్లె వైద్యానికి ఆటంకం ఏర్పడనుంది.



- నేటి నుంచి సమ్మెలోకి వెళ్లనున్న పీహెచ్‌సీ వైద్యులు
- ఓపీ సేవలు బంద్
- అత్యవసర సేవలకు మినహాయింపు
- సర్వీస్ వైద్యుల పీజీ కోటా తగ్గింపుపై ఆగ్రహం
- ఏళ్ల తరబడి పని చేస్తున్నా సీనియర్ మెడికల్ ఆఫీసర్స్‌గానే మిగిలిపోతున్నామని ఆవేదన
- కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పల్లె ప్రజలకు వైద్యసేవలు దూరం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): గ్రామీణ పని చేసే వైద్యుల విషయంలో ప్రభుత్వం వహిస్తున్న నిర్లక్ష్యం కారణంగా డాక్టర్లు సోమవారం నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు ప్రకటించారు. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ ఫీవర్స్ పట్టి పీడిస్తున్న తరుణంలో డాక్టర్లు సమ్మెలోకి వెళ్తే ప్రజలు ఇబ్బంది పడే అవకాశం ఉంది. అయినా కూడా పీహెచ్‌సీ వైద్యుల డిమాండ్లను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చొరవ చూపడం లేదు. జిల్లాలో 50 పీహెచ్‌సీలు, 15 అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. వీటి పరిధిలో దాదాపు 95 మంది వైద్యులు సేవలందిస్తున్నారు. పీహెచ్‌సీ వైద్యులు పీజీ కోర్సులు చేసేందుకు గతంలో క్లినిక్‌లు 30 శాతం, ఫిజియాలజీ, ఎనాటమీ, ఫార్మసీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్ తదితర నాన్‌క్లినిక్‌లకు 50 శాతం సీట్లు ఉండేవి. కూటమి ప్రభుత్వం గతేడాది క్లినిక్‌లు 15 శాతానికి, నాన్ క్లినికల్ 30 శాతానికి తగ్గించింది. అప్పట్లో వైద్యులు ఆందోళనకు దిగడంతో క్లినికల్ 20 శాతానికి పెంచారు. తాజాగా మళ్లీ 15 శాతానికి తగ్గించేసినట్టుగా ఏపీపీహెచ్‌సీడీఏ చెబుతోంది. సీహెచ్‌సీల్లో పనిచేస్తే మూడు, నాలుగేళ్లకే డిప్యూటీ సివిల్ సర్జన్స్‌గా ప్రమోషన్ ఇస్తుంటే 20 ఏళ్లుగా పీహెచ్‌సీల్లో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా పని చేస్తున్నా పదోన్నతులు రాక సీనియర్ మెడికల్ ఆఫీసర్స్‌గానే మిగిలిపోతున్నామని ఆవేదన చెందుతున్నారు.

సేవలను గుర్తించని కూటమి ప్రభుత్వం..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన సర్వేలు, పల్స్ పోలియో, వరదలు, విపత్తుల సమయంలో క్షేత్రస్థాయిలో సేవలందిస్తున్న సివిల్ అసిస్టెంట్ సర్జన్లకు పదోన్నతులు రావడం లేదని, జాయిన్ అయినప్పుడు ఉన్న కేడర్‌లోనే రిటైర్డు అవుతున్న పరిస్థితి ఉంటోందని వైద్యులు చెబుతున్నారు.

ఇదీ వైద్యుల డిమాండ్..

సర్వీస్‌లోని పీహెచ్‌సీ వైద్యులకు పీజీ కోటాలో సీట్లను పునరుద్ధరించాలి. టైం బాండ్ ప్రమోషన్స్ కల్పించాలి. మారుమూల ప్రాంతాల్లో పనిచేసేవారికి బేసిక్‌పై 50 శాతం అలవెన్స్, చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమానికి రూ.5 వేలు అలవెన్స్ ఇవ్వాలి. కౌన్సెలింగ్ విషయంలో అర్బన్ అండ్ నేటివిటీపై ఆరేళ్ల గడువును ఐదేళ్లకు కుదించాలి.

సీజనల్‌కు సమ్మె ఎఫెక్ట్

జిల్లావ్యాప్తంగా సీజనల్ వ్యాధులు ముసురుకుంటున్నాయి. ప్రధానంగా ప్రతి పల్లెజనం విషజ్వరంతో అల్లాడిపోతున్నారు. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు జ్వరం బారిన పడ్డారు. జేబులో డబ్బులు ఉంటే ఆర్‌ఎంపీ, ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్నారు. ఆర్థిక స్థోమత లేనివారంతా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే క్యూకడతారు. ఈ మధ్యకాలంలో జ్వరం కేసులు ఆరోగ్య కేంద్రాలను చుట్టిముడుతున్నాయి. ఇలాంటి తరుణంలో డాక్టర్ల సమ్మె పేద రోగులకు ఇబ్బందికరంగా మారనుంది. ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

సమ్మెకు సహకరించాలి..



మా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టనున్న ఈసమ్మెకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. ప్రధానంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. ఇతర దేశాల్లో జనరల్ ఫిజీషియన్స్‌ను ప్రోత్సహిస్తున్నారు. అదే తరహాలో ఇక్కడ కూడా జనరల్ ఫిజీషియన్‌ను పీహెచ్‌సీలోకి తీసుకోరాలి. ఇతర న్యాయపరమైన డిమాండ్లను త్వరితగతిన పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాం.

– శిరీష, ఏపీపీహెచ్‌సీడీఏ డిస్ట్రిక్ జనరల్ సెక్రటరీ, చిత్తూరు

డిమాండ్లను పరిష్కరించాలి..



పల్లెలో అనేక ఇబ్బందుల నడుమ ఆరోగ్య సేవలు అందింస్తున్నాం. ఇలా ఏళ్ల తరబడి సేవలందిస్తున్నా.. అందుకు తగ్గ ప్రతిఫలం ఉండడం లేదు. పీజీకోటా, అలవెన్స్ ఇతరత్రా సమస్యలు అలానే మిగిలిపోయాయి. మారుమూల ప్రాంతాల్లో పనిచేసే వారి పరిస్థితి దయానీయంగా ఉంది. తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని పలుమార్లు సీఎంతో పాటు మంత్రులను కలిసి వినతి చేశాం. కానీ ఇంతవరకు న్యాయం జరగలేదు. ఈమేరకు రాష్ట్ర కమిటీ మేరకు సమ్మెకు వెళ్లనున్నాం.

–చంద్రమహేష్, ఏపీపీహెచ్‌సీడీఏ సభ్యులు,చిత్తూరు

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం

- తమిళనాడులో జరిగిన లారీ ప్రమాదంలో బాలుడు దుర్మరణం
- లారీని వెనుక వైపు ఢీకొనడంతో ఘటన
- వెండుగంపల్లి వద్ద జరిగిన ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృత్యువాత



దుర్మరణం పాలైన బాలుడు సాత్విక్ (ఫైల్)

కుప్పంరూరల్: రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం పాలైన సంఘటన కుప్పంలో వెలుగు చూసింది. తమిళనాడు రాష్ట్రంలో జరిగిన కారు ప్రమాదంలో 17 ఏళ్ల బాలుడు దుర్మరణం పాలవగా, కుప్పం మండలం వెండుగంపల్లి వద్ద జరిగిన ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. వివరాలు ఇలా..

తమిళనాడు ప్రమాదంలో ..

కుప్పం పట్టణానికి చెందిన రవికుమార్ ఓ ప్రైవేట్ బ్యాంకులో ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం సొంత పనులపై భార్య, కుమారుడు సాత్విక్ (17)తో కలిసి చెన్నైకి వెళ్లాడు. పనులు ముగించుకుని శనివారం రాత్రి కుప్పానికి తిరుగుప్రయాణం అయ్యారు. మార్గమధ్యలో నాట్రంపల్లి వద్ద లారీని వెనుక వైపు నుంచి ప్రమాదవశాత్తు ఢీకొన్నాడు. ఈ ఘటనలో సాత్విక్ (17) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. రవికుమార్, అతని భార్య గాయాలతో బయటపడ్డారు.

వెండుగంపల్లి వద్ద ఘటనలో..

కుప్పం మండలం వెండుగంపల్లి వద్ద ఆదివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో జరిగిన ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. కుప్పం మండలం గట్టప్పనాయునిపల్లికి చెందిన మునెప్ప (50) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం సొంత పనులపై బైక్‌లో వెండుగంపల్లి వైపునకు వెళ్లాడు. పైనాసికి క్రాస్ వద్ద మునెప్ప ప్రయాణిస్తున్న బైక్‌ను టాటాఏస్ వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో మునెప్ప అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. విషయం తెలుసుకున్న స్థానికులు బంధువులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు.

తిరుమలలో అప్రమత్తమైన పోలీసులు

తిరుమల : తమిళనాడులో తొక్కిసలాట జరగడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఏపీ అదనపు డీజీ మధుసూదన్‌రెడ్డిని తిరుమలకు పంపించారు. తిరుమల గరుడ సేవలో భద్రతపై జిల్లా ఎస్పీ సుబ్బరాయుడుని ఆరా తీసి పలు ప్రాంతాల్లో పరిశీలించారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన చర్యలు చేపట్టారు. అనంతరం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో జాయింట్ స్క్రీన్‌ల ద్వారా పరిశీలించారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రత్యేక క్రౌడ్ మేనేజ్మెంట్ ప్లాన్‌ను అమలు చేస్తున్నామన్నారు. భక్తుల రాకపోకలు, వాహనాల పార్కింగ్ , ఎమర్జెన్సీ సర్వీసులు వైద్య బృందాలు కదలికపై అధికారులు ప్రత్యేక సూచనలు తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికమైంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ గోగర్భం డ్యాం వద్దకు చేరింది. శనివారం అర్ధరాత్రి వరకు 75,006 మంది స్వామివారిని దర్శించుకోగా 45,413 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.36 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఆరుగురు విద్యార్థుల సస్పెన్షన్

నారాయణవనం: జూనియర్ విద్యార్థిపై సీనియర్లు దాడి చేసిన సంఘటనలో ఆరుగురు విద్యార్థులను స్థానిక ప్రైయివేట్ కళాశాల యాజమాన్యం సస్పెండ్ చేసింది. తన గర్ల్ ఫ్రెండ్‌తో చనువుగా ఉన్నాడంటూ కళాశాల హాస్టల్లో ఉంటున్న అన్నమయ్య జిల్లాకు చెందిన జూనియర్ విద్యార్థిని బుధవారం రాత్రి తమ గదికి పిలిపించిన సీనియర్ తన ఐదుగురి స్నేహితులతో కలిసి దాడి చేసి, వీడియో రికార్డ్ చేశారు. బాధిత విద్యార్థి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురి సీనియర్లపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. సీనియర్లను సస్పెండ్ చేసి కళాశాల హాస్టల్ నుంచి వారి తల్లిదండ్రులతో పంపించినట్లు యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది.

శ్రీసిటీ మ్యాంగో రిసార్ట్‌కు పురస్కారం



సీఎం నుంచి అవార్డు అందుకుంటున్న మేనేజర్ శ్రీనివాసరావు

శ్రీసిటీ(సత్యవేడు) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పర్యాటక రంగం ఎంపిక చేసిన 2024–25 పర్యాటక ఎక్సలెన్సీ అవార్డులలో 'ఉత్తమ థీమ్-బెస్ట్ రిసార్ట్' అవార్డును శ్రీసిటీ మ్యాంగో రిసార్ట్ అందుకుంది. ఇక్కడ అమలు చేస్తున్న స్థిరమైన ఆకర్షణీయమైన అతిథ్య సేవలకు గాను ఈ గుర్తింపు దక్కింది. శుక్రవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ప్రపంచ పర్యాటక దినోత్సవం-25 సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు , పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్ , సీనియర్ ప్రభుత్వ అధికారులు హాజరైన కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. మ్యాంగో రిసార్ట్ తరపున రిసార్ట్ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు ఈ అవార్డును స్వీకరించారు. శ్రీసిటీలోని సుందర సువిశాల ప్రాంతంలో ఉన్న మ్యాంగో రిసార్ట్ 20 లగ్జరీ కాటేజీలు, 10 సాధారణ గదులను కలిగి ఉంది. ఇక్కడ బస చేసే అతిథులు మంచి ప్రకృతిని వీక్షించడంతో పాటు కయాకింగ్, ట్రెక్కింగ్, సైక్లింగ్ పక్షులను వీక్షించడం వంటి వివిధ రకాల కార్యకలాపాలను ఆస్వాదించవచ్చు. శ్రీసిటీ మ్యాంగో రిసార్ట్‌కు వరుసగా రెండవ సారి అవార్డు దక్కడం విశేషంగా చెప్పవచ్చు. రీసార్టును తీర్చిదిద్దిన విధానాన్ని ప్రశంసించారు.

చెరువు చెప్పదు.. ఆక్రమణ ఆగదు

చెరువులు ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకునే వారు కరవయ్యారు. అధికారులు చెరువుల చుట్టూ శాశ్వత హద్దులు ఏర్పాటు చేయకుండా మొక్కుబడిగా వ్యవహరిస్తున్నారు. చెరువు భూముల్లో మట్టిని, గ్రానైట్ వ్యర్థాలను పోస్తూ టీడీపీ నేతలు అధికార దర్పంతో ఆక్రమణకు పాల్పడుతున్నారు. చిత్తూరు కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్న గంగాసాగరం చెరువును ఆక్రమించేస్తున్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తూ టీడీపీ కబ్జాదారులకు సహకరిస్తుండడంతో సర్వత్రా విమర్శలు గుప్పుమంటున్నాయి. జిల్లా కేంద్రానికి సమీపంలోని గంగాసాగరం చెరువు ఆక్రమణపై సాక్షి కథనం..

- కూటమి నేతలకు కల్పతరువుగా చెరువులు
- యథేచ్ఛగా ఆక్రమిస్తున్నా నోరు మెదపని అధికార యంత్రాంగం
- చిత్తూరు కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోనే చెరువులో ఆక్రమణలు
- మట్టి, గ్రానైట్ రాళ్లతో చెరువును పూడ్చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువు

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్రంలో ఎప్పుడు టీడీపీ అధికారంలోకి వచ్చినా ఆ పార్టీ నేతలు ప్రకృతి వనరులపైనే పడతారు. వాటిని ఆక్రమించడం.. ప్లాట్లు వేసి అమ్ముకోవడం పరిపాటిగా మార్చుకున్నారు. గత ఎన్నికల్లో మళ్లీ కూటమి అధికారంలోకి రావడంతో తమ పంథా మొదలుపెట్టారు. చెరువు ఏదైనా తమదే ఆక్రమణ అనేలా తెగబడుతున్నారు. వీరి ఆక్రమణలకు అంతులేకుండా పోవడంతో భవిష్యత్ రోజుల్లో మనం పుస్తకాల్లో మాత్రమే చెరువుల గురించి చదువుకునే స్థితికి చేరుకునేలా కబ్జాలకు గురవుతున్నాయి. కూటమి సర్కారు పాలనలో చెరువులు యథేచ్ఛగా ఆక్రమణలకు గురవుతున్నాయి. దీంతో చెరువులు పూర్వపు రూపురేఖలు కోల్పోతున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా టీడీపీ నేతలు అధికారదర్పంతో చెరువుల ఆక్రమణకు పాల్పడుతున్నారు. చెరువులు ఆక్రమణలతో ఆయకట్టుదారులకు సమీప గ్రామాల ప్రజలకు నీరందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టీడీపీ కబ్జాదారుల ఆక్రమణలపై పలుమార్లు పీజీఆర్ఎస్ (ప్రజాసమస్యల పరిష్కార వేదిక)లో ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ స్పందన లేదు. అధికారుల ఉదాసీనతతో చెరువులు రూపురేఖలు కోల్పోతుండగా తూములు పూడిపోతున్నాయి.



కబ్జాకు గురవుతున్న గంగాసాగరం చెరువు

కలెక్టరేట్‌కు కూతవేటులో ఆక్రమణ

జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌కు కూతవేటులో ఉన్న గంగాసాగరం చెరువు ఎంతో పురాతనమైనది. ఇది జిల్లాలోని ప్రధాన నీటి వనరులలో ఒకటిగా గుర్తింపు పొందింది. గంగాసాగరం చెరువు 45 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, ఇప్పటికే 15 ఎకరాల వరకు ఆక్రమణకు గురైంది. చెరువు సమీపంలో 125-1 సర్వే నంబర్‌లో 1975లో డీకేటీ పట్టా ఇచ్చారు. దాన్ని మళ్లీ అధికారులే 1978లో రద్దు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గంగాసాగరం చెరువుపై టీడీపీ నేత కన్ను పడడంతో కబ్జా చేసేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం ఆ చెరువులో మట్టి, గ్రానైట్ వ్యర్థాలను తీసుకొచ్చి పూడ్చేసి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ చెరువు ఆక్రమణపై పలుమార్లు రెవెన్యూ అధికారుల దృష్టికి అక్కడి స్థానికులు ఫిర్యాదు చేసినా ఏమాత్రం పట్టించుకోని దుస్థితి. కలెక్టర్ ప్రత్యేక దృష్టి వహించి గంగాసాగరం చెరువు ఆక్రమణకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

కొన్ని ఆక్రమణలు ఇలా..

- చిత్తూరు నగరంలోని గంగినేనిచెరువు గతంలో 45.43 ఎకరాల విస్తీర్ణంలో ఉండేది. సుమారు 10 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు ఇరిగేషన్ అధికారులు గుర్తించారు. ఇలా చిత్తూరు నగరంలోనే వేర్వేరు చెరువుల భూములు 80 ఎకరాల వరకు కబ్జా బారిన పడ్డాయి.
- రికార్డుల్లో జడియం చెరువుగా, వాడుకలో కాజూరు చెరువుగా పిలిచే ఈ చెరువు సర్వే నంబర్ 159, 170లో దాదాపు 200 ఎకరాల వరకు ఉంది. ఇరువారం, కొండప్రాంతం, పోతంబట్టు ప్రాంతాల నుంచి ఏడు సప్లై చానళ్లు ఉండేవి. కాలక్రమేణా వీటిలో ఐదు చానళ్లను కబ్జాదారులు ఆక్రమించుకున్నారు. ఇక్కడ ఎకరం భూమి ధర రూ.15 కోట్ల వరకు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఈ లెక్కన కబ్జాదారులు ఆక్రమించుకున్న భూముల ధర రూ.75 కోట్ల వరకు ఉంటుందని సమాచారం.
- నగరి నియోజకవర్గంలోని వడమాలపేట మండలం ఎస్‌బీఆర్‌పురం చెరువు ఆక్రమణకు గురైంది. ఆ చెరువు మొత్తం విస్తీర్ణం 487 ఎకరాలు. అందులో 48 ఎకరాలు, 439 ఎకరాలకు మునక పట్టాలు ఉన్నాయి. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జీఓ నంబర్ 188 ప్రకారం చెరువులో నీరు లేనప్పుడు మాత్రమే రైతులు సాగు చేయాలి. అయితే స్థానిక టీడీపీ నాయకుడు చెరువులో గ్రానైట్ పోసి దాదాపు 3 ఎకరాల వరకు ఆక్రమించుకున్నారు. అయినప్పటికీ అధికారులు నోరు మెదపడం లేదు.
- పలమనేరు నియోజకవర్గంలో మొత్తం 787 చెరువులు ఉన్నాయి. ఇందులో మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు (100 ఎకరాల విస్తీర్ణం ఉన్నవి) 57 వరకు ఉన్నాయి. చిన్నపాటి కుంటలు 60 వరకు ఆక్రమణలకు గురై కనుమరుగయ్యాయి. మిగిలిన వంద చెరువులు 10 నుంచి 30 శాతం వరకు కబ్జాల బారిన పడ్డాయి. ఈ చెరువుల కింద ఆయకట్టు గతంలో 20 వేల హెక్టార్లు ఉండగా ప్రస్తుతం 2 వేల హెక్టార్లలో మాత్రమే పంటలు సాగు చేసుకుంటున్నారు. ఇలాంటి చెరువుల ఆక్రమణ జిల్లావ్యాప్తంగా అనేకంగా ఉన్నాయి.

ఏ చెరువులోనూ సెంటు భూమిని కూడా ముట్టుకునే అధికారం జిల్లా సర్వోన్నత అధికారాలు ఉన్న కలెక్టర్‌కు కూడా లేవు. ప్రజాప్రతినిధులకు సైతం వాటిని ప్రోత్సహించే హక్కు లేదు. ప్రజా ప్రయోజనాల అవసరం కోసం చెరువును ముట్టుకున్నా, దానికి చట్టపరమైన విధి విధానాలకు లోబడే జరగాలి.

– చెరువుల పరిరక్షణపై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు ఇవి



గంగాసాగరం చెరువులో వ్యర్థాలను వేసి కబ్జాకు పాల్పడుతున్న టీడీపీ నేత

చెరువుల వివరాలు..

జిల్లాలోని చెరువులు	4303
ఆయకట్టు	46,903 ఎకరాలు
నీరందుతున్న ఆయకట్టు	20 వేల ఎకరాలు
ఆక్రమణకు గురైన చెరువులు	1800
కబ్జాబారిన పడిన విస్తీర్ణం	1147 ఎకరాలు
చిత్తూరు నగర పరిధిలో చెరువుల విస్తీర్ణం	630 ఎకరాలు
నగర పరిధిలో ఆక్రమణకు గురైన చెరువులు	75 ఎకరాలు

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOTS FOR SALE
తిరుపతి అర్బన్‌లో 3 Tuda అప్రూవ్డ్ లే అవుట్స్‌లో ఇన్వెస్ట్‌మెంట్‌కు, రెసిడెన్షియల్‌గా, కమర్షియల్‌గా 1) రేణిగుంట దగ్గర యోగానంద ఇంజనీరింగ్ కాలేజ్ ప్రక్కన KVRR హైల్యాండ్స్ వెంచర్ 2) ఆకార్, ఢిల్లీ పబ్లిక్ కార్పొరేట్ స్కూల్స్ దాటగానే సి.రామాపురంవద్ద3)చంద్రగిరి ఆంజనేయ స్వామి Statue దాటగానే మెయిన్ రోడ్ ఫేసింగ్ వెంచర్‌లో వెంటనే ఇల్లు,Villa,అపార్ట్‌మెంట్స్ కట్టుకునే100% వాస్తు Plots అమ్మబడును. ✆ 9505502346.

PERSONAL CARE

CHANGE OF NAME
I, Vishal Kumar (Old Name) Residing at D.No.1-14-301, Jaya Nagar Colony, Avilala, Tirupati Rural Mandal, Tirupati Dist. A.P. Have Changed my Name as Putturu Vishal Kumar, S/o Putturu Murali Manohar Reddy (New Name)

Wanted
తిరుపతి APSRTC బస్టాండులోని పార్సిల్ కౌంటర్ నందు పనిచేయుటకు బాయ్స్ / గర్ల్స్ కావలెను. సంప్రదించండి సెల్: 86888 18881.

హాస్పిటల్స్ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డ్రైవర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.9666253675

గమనిక

వాణిజ్యపరమైన ప్రకటనలు రూ. 375/- అదనపు లైనుకు రూ.:90/- ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం

CONTACT : 9440166091, 9951602970